క్లుప్తంగా

ఈ క్రాఫ్ నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

కాళ్ల: రబీ పంటకు రైతులందరూ ఈ క్రాఫ్ నమోదు తప్పనిసరిగా చేసుకునేలా చూడాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. కాళ్ల మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులకు రబీ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జయవాసుకి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్తమ వైద్య సేవలు



దొడ్డనపూడిలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

కాళ్ల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు ఉత్తమ వైద్యం అందించగలుగుతామని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు అన్నారు. శనివారం దొడ్డనపూడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం డాక్టర్ పి.రమామహేశ్వరి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. గ్రామంలో 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశామని మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ డి.విజయవతి, వైద్య సిబ్బంది కుమార్, శ్రీదుర్గ, సరోజిని, సతీష్, శిరీష, ఆశ వర్కర్లు సరిత, వెంకట లక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ యువజన విభాగ ఇన్‌చార్జిగా అశోక్‌కుమార్



నియామకపత్రాన్ని అందుకుంటున్న అశోక్‌కుమార్

సాక్షి, భీమవరం: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ భీమవరం నియోజకవర్గ యువజన విభాగ ఇన్‌చార్జ్‌గా వీరవాసరం గ్రామానికి చెందిన బోను అశోక్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఉభయతెలుగు రాష్ట్రాల యువజన విభాగం వైస్ చైర్మన్ కొక్కిరి చిట్టిబాబు అందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కలిగించడమేగాక ప్రజల సమస్యలను చట్టం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

సారా కేసులు నమోదు

ఉండి: ఉండి మండలం వెలివర్రు గ్రామానికి చెందిన ఓ మహిళపై అధికారులు సారాకు సంబంధించి రెండు కేసులు నమోదు చేశారు. వెలివర్రులో ఓ మహిల ఇంటి వద్ద నాటుసారా ఉందనే సమాచారంతో డీటీఎఫ్, ఎస్ఈబీ సీఐ కె.కోటేశ్వరరావు, ఎస్సై ఎం రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం దాడి చేసి లీటరు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం మరోసారి ఆమె ఇంటివద్ద దాడి చేసి 50 లీటర్ల బెల్లపు ఊటను మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ మేరకు ఆకివీడు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. నిందితురాల్ని అరెస్టు చేయాల్సుందని పోలీసులు తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వృద్ధాప్యానికి చేరుకున్న అభాగ్యులు, నిరాధరణకు గురైన పేదలు, యాచకులకు చేతనైన సహాయం చేయడం దేవుడిచ్చిన వరమని భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ అన్నారు. భీమవరం, చినపేట 23వ వార్డులోని, యేవేలు ప్రార్థనా మందిరం వద్ద జీడీవీ ఫౌండేషన్ చైర్మన్ గోగులమండ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో నిరుపేదలకు, యాచకులకు వస్త్రాలు, పండ్లు ,భోజనం, నగదు అందించారు. కార్యక్రమానికి వన్ టౌన్ సీఐ.అడబాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఫౌండేషన్ చైర్మన్ రాజేష్ కన్నాను అభినందించారు. భీమవరం మండల తహసీల్దార్ వై.రవికుమార్, చర్చి పాస్టర్ యిర్రింకి యేవేలు రాజు, సువార్త రాజు, సీహెచ్.జ్యోతి రాజు, పి.మోషయ్య, కాటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

జూదాలు ఆడేవారిపై కఠిన చర్యలు

భీమవరం అర్బన్: కోడి పందేలు, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ దాసి రాజు హెచ్చరించారు. భీమవరం మండలంలోని తోకతిప్ప గ్రామంలో కోడి పందేలు, జూదాలపై శనివారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో దాసి రాజు మాట్లాడుతూ పండుగల ముసుగులో కోడి పందేలు, పేకాట, కోశాట ఇతర జూదాలు నిర్వహించడం, ఆడటం నేరమని చట్టపరంగా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. ఇప్పటికే గతంలో కోడి పందేలు నిర్వహించిన వారు, ఆడిన వారిని బైండోవర్ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై. రవికుమార్, వీఆర్‌వో సంధి కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు: గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ హెచ్చరించారు. శృంగవృక్షం గ్రామంలో జూదాలు నిర్వహించవద్దంటూ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ గేమింగ్ చట్టం ప్రకారం కోడిపందేలు నిర్వహించడం, బరులకు స్థలం ఇవ్వడం, పేకాట, గుండాటలు నిర్వహించడం నేరమని అన్నారు. రాబోయే సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాట్మింటన్, క్రికెట్, పరుగు పందెం, ముగ్గుల పోటీలు వంటివి నిర్వహించి ఇంటిల్లపాదీ సరదాగా ఆనందంగా పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడల నిషేధంపై అవగాహన

ఆకివీడు : సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో సంతోషంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. కోడి పందేలు, జూద క్రీడల నిషేధంపై ఆకివీడు మండలం దుంపగపడ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ హిందువుల పెద్ద పండుగ సంక్రాతిని కుటుంబం అంతా సంతోషాలతో గడపాలన్నారు. ఎస్సై కె.రాజారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని, కోడి పందేలు, జూద క్రీడలు ఆడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. ర్యాలీలో సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదాలు జోలికి వెళ్తే జీవితాలు నాశనం

భీమవరం అర్బన్: కోడిపందేలు, పేకాట, గుండాట ఇతర జూద క్రీడలు ఆడటం చట్ట పరంగా నేరమని కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని వాటి జోలికి వెళ్లి చేజేతులా జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వర్మ అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాలలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ కోడి పందేలు, పేకాట, గుండాట ఇతర జూద క్రీడలు వల్ల కలిగే అనర్థాలు గురించి శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వర్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజున క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలతో కుటుంబ సభ్యులతో ఆడుతూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. నాటు సారా, సుంకం చెల్లించని మద్యం విక్రయించడం, గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయిస్తే అట్టి వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, పేకాట, గుండాట, కోశాట, ఇతర జూద క్రీడలు నిర్వహించినా, ప్రోత్సహించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గ్రామాలలో నిఘా ఏర్పాటు చేశామని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడింతే విలేజ్‌లో మహిళా కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



తొకతిప్ప గ్రామంలో కోడి పందేలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ దాసి రాజు



దుంపగడప గ్రామంలో ర్యాలీ



శృంగవృక్షంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పింఛన్లతో పండుగ వాతావరణం



ఎన్నార్పీ అగ్రహారంలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు

ఉండి: కొత్త పింఛన్లు, పెంచిన పింఛన్లతో ప్రజలు ముందుగానే సంక్రాంతి పండుగ చేసుకుంటున్నారని ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మి అన్నారు. శనివారం గ్రామ సచివాయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 18 మందికి కొత్త పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడు విప్పర్తి మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు గలావిల్లి ధనుంజయ, జిల్లెళ్ల నిర్మల, బులుసు రామకృష్ణ మాట్లాడారు. అర్హులకు కొత్తగా పింఛన్‌లు మంజూరు చేయడమే కాకుండా రూ.2500 ఉన్న పింఛన్‌ను రూ.2750కి పెంచి అందజేయడం మరింత సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడలి సత్యనారాయణ, వార్డు సభ్యులు సత్తిబాబు, రెడ్డి శ్రీను, పెదపాటి బాలకృష్ణ, నలభ రాజు, బేతాళ పుష్ప, ఆలమూరి జయలక్ష్మి, పాత్రి వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో స్ట్రిప్ రోప్ లైటింగ్ ఏర్పాటు

సాక్షి, భీమవరం: పట్టణ సుందరికీరణ లో భాగంగా వన్ టౌన్, టూ టౌన్, 3 టౌన్ లలో స్ట్రిప్ రోప్ లైటింగ్ సౌకర్యాలను రూ. 5 లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వన్ టౌన్ లోని ఓవర్ బ్రిడ్జి పై ఏర్పాటు చేసిన స్ట్రిప్ రోప్ లైటింగ్ ను శనివారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. భీమవరం జిల్లా కేంద్రం కావడంతో ఈ పట్టణాన్ని మెట్రో సిటీ తరహాలో అభివృద్ధి చేసే విధంగా కూడా కార్యాచరణ చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కావడంతో నిత్యం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వ జిల్లా కార్యాలయాల కు వివిధ పనుల నిమిత్తం వస్తున్న నేపథ్యంలో వారికి పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కుల అభివృద్ధిని కూడా వేగవంతంగా చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భీమవరం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేసి జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఉన్నత అధికారులను మరింతగా చేరువ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.త్రినాథరావు, డీఈ తోట నారాయణరావు, ఎలక్ట్రికల్ ఏఈ బి సత్యనారాయణ, పార్టీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లైటింగ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో ఏర్పాటు చేసిన స్ట్రిప్ రోప్ లైటింగ్

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి

సాక్షి, భీమవరం: భీమవరం కోర్టుల పరిధిలో పెండింగ్‌లోఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఫిబ్రవరి 11న నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కారం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమవరం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ అన్నారు. శనివారం భీమవరం కోర్టు హాల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రాజీ చేయదగిన కేసులను గుర్తించి కక్షిదారులకు నోటీసులిచ్చి ఉభయులకు సమన్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. దీనిపై కక్షిదారులకు లోక్‌అదాలత్ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించి లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు ప్యానల్ లాయర్స్ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించాలని జడ్జి పవన్‌కుమార్ చెప్పారు. భీమవరం సీఐలు అడబాల శ్రీను, బి కృష్ణకుమార్, ఏపీపీ రామతులసి, కాళ్ళ, వీరవాసరం, పాలకోడేరు ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

ఉండి: మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడితే వరిపంటకు నష్టమని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో ఉండి మండలం ఉప్పులూరు రైతు భరోసా కేంద్రంలో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు అధిక దిగుబడికి, తక్కువ ఖర్చుతో లాభసాటిగా వ్యవసాయానికి ఉపకరిస్తాయని అన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకే వరిసాగులో ఎరువులు పురుగుమందులు వాడాలని సూచించారు. సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దుబ్బు ఎదుగులపై ప్రభావం చూపిస్తుందన్నారు. నాట్లు వేసే సమయంలో నాటుకు నాటుకు మధ్య సరైన దూరం పాటించడం ద్వారా పంటకు మంచిగాలి, ఎదిగేందుకు సరైన అవకాశం దొరుకి మంచి దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. తెగుళ్ల భారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. తెగుళ్ల సోకకముందే పురుగుమందుల పిచికారీ పంటకు ప్రమాదకరంగా మారుతుందని చెప్పారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటారని ఎటువంటి సమాచారాన్నయినా వారి నుంచి పొందవచ్చునని తెలిపారు. డీఆర్‌సీ ఏఓ కాళీమాత, ఏఓ బి.సంధ్య, సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, వీఏఓ ఎం మహేంద్ర,పలువురు రైతులు పాల్గొన్నారు.



ఉప్పులూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

కాళ్ల: సీఎం సహాయనిధి పేద కుటుంబాలకు భరోసా ఇస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ కార్యాలయంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి నుంచి ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలంలోని పెన్నాడ అగ్రహారం చెందిన ఒకరికి రూ.60 వేలు, శృంగవృక్షం గ్రామానికి చెందిన ఒకరికి రూ.1.10 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వైద్యం అందక ఇబ్బంది పడుతున్న పేద రోగులు సీఎం సహాయనిధి వల్ల మేలు పొందగలుగుతున్నారని చెప్పారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, సొసైటి చైర్మన్ కొత్తపల్లి విశ్వనాథరాజు, కలిదిండి కృష్ణంరాజు,పెనుమత్స శ్రీనివాసరాజు, భూపతి రాజు వంశీకృష్ణ ంరాజు, గుండు నాగేశ్వరరావు, దుండి అశోక్, గోపాల కృష్ణంరాజు, పాపారావు, కలవపూడి, పెన్మెత్స ప్రసాద్ రాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, గణేశ్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీవీఎల్

కోటేశ్వరరావుకి కళా విజ్ఞాన్ అవార్డు

ఆకివీడు: సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే కళల్ని ప్రోత్సహిస్తూ, కళాకారుల్ని ఆదరించడం అభినందనీయమని కళా పోషకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్లూరి రంగారావు అన్నారు. తన సరిగమ సంగీత పరిషత్ ద్వారా ఎంతో మంది గాయకుల్ని తయారు చేసిన ఎస్.కోటేశ్వరరావు(పాటలకోటి)కి గుంటూరు జిల్లా చిలకలూరి పేటకు చెందిన కళా నిలయం సాంస్కృతిక సంస్థం కళా విజ్ఞాన్ అవార్డును శుక్రవారం అందజేసింది. ఈ సందర్భంగా శనివారం ఆయన నివాసంలో అభినందించిన రంగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో ఎందో మంది ఉత్తమ పౌరుల్ని తయారుచేసిన కోటేశ్వరరావు, కళాకారుడుగా, గాయకుడుగా ఎంతో మంది గాయకుల్ని తయారు చేశారని కొనియాడారు. కొల్లేరు తీరంలోని కుగ్రామం కాళింగగూడెంలో పుట్టిన కోటేశ్వరరావు అంచెలంచెలుగా ఎదిగి కళారంగంలో మంచి కీర్తని గడించారని అభినందించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన కళా విజ్ఞాన్ అవార్డు తనను వరించడం అదృష్టమన్నారు. కళాకారులకు, గాయకులకు, కళా సంస్థలకు, తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



కోటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఎంతో ముఖ్యం

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థి జీవితాల్లో ప్రగతిని సాధించాలంటే సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులలో ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్స్ వల్ల క్యాంపస్ సెలక్షన్స్‌లో విజయం సాధించవచ్చునన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ యువ ఇంజినీర్ల నైపుణ్యాన్ని ఈ శిక్షణ ద్వారా ఎలా సంతరించుకోవాలో విద్యార్థులు తెలుసుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.వెంకన్న నాయుడు, హెచ్‌ఓడీ డాక్టర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.



డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

దాడి చేశారని ఫిర్యాదు

పాలకోడేరు: మోగల్లు గ్రామంలో తన స్థలంలో అదే గ్రామానికి చెందిన మూడెడ్ల వెంకటరావు నలుగురు మనుషులను తీసుకొచ్చి గొయ్యి తవ్వుతుండగా ఇదేంటని అడిగినందుకు దాడి చేశారని మూడెడ్ల వెంకట్రావు అతను తల్లి నాగమణిపై చింతా సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై చింత సావిత్రిపైనా కౌంటర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు.

ఫిబ్రవరి 6 నుంచి జాతీయస్థాయి హేక్‌థాన్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6 నుంచి వారం రోజులుపాటు జాతీయ స్థాయిలో బూట్ క్యాంప్, 24 గంటల హేకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.హేమలత మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన బ్రెయినోవిజన్ సాంకేతిక సంస్థ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలో డాక్టర్ కె.కిషోర్ రాజు, బి.తేజశ్రీ, వి.సాయిబాబా, ఎంకే సత్యవర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో జాతీయస్థాయి హేక్‌థాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీరవాసరం: మండలంలోని కొణితివాడ గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌కు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ఎస్.గీతాదేవి తెలిపారు. రైతులు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భీశెట్టి కోటేశ్వరరావు, నల్లం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపురం మున్సిపల్ పాఠశాల తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ రాష్ట్ర పరిశీలకురాలు ఆర్ఎస్ గంగాభవాని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేస్తుందని పాఠశాలలో ఐసీటీ, స్పోర్ట్స్‌తో పాటు మౌలిక సదుపాయాలను ఏర్పరచుకోడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. దుర్గాపురం మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ బాబాజీ సాహెబ్ సమర్పించిన రికార్డులను, ఫొటోలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సమగ్ర శిక్ష ఏ ఎం ఓ ఎంఎస్ శ్రీమన్నారాయణ, ఏఎస్ ఓ సిహెచ్ఎస్ వి సుబ్రహ్మణ్యం, మండలవిద్యాశాఖాధికారి బి.వినాయకుడు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాల, భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ ఎండ్ల బండ్లు, భోగిమంటలు, హరిదాసు, గరగనృత్యాలు, బుట్టబొమ్మలు, గొబ్బెమ్మలు, కోలాటం,హరిదాసులు, గంగిరెద్దులు, జంగమదేవరులు, పిట్టలదొర, సోది, కొమ్మదాసులు, ఆంజనేయస్వామి వంటి వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. అలాగే విష్ణు కళాశాలలో సంప్రదాయ పిండి వంటలు, ఇతర రుచులతో 30 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. గుర్రపుస్వారీ, ఒంటె స్వారీ, ఆవులు, పెంకుటిళ్లు, రథం, రంగులరాట్నం, జెయింట్‌వీల్ వంటివి విద్యార్థులను ఆకట్టుకోగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.



శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థికి ట్యాబ్ పంపిణీ

కాళ్ల: పదో తరగతిలో ఫస్ట్ క్లాస్ వచ్చిన విద్యార్థికి బైరాజ్ ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహాలు అందించడం అభినందనీయమని కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ మూర్తి తెలిపారు. బైర్రాజు అప్పల నరసమ్మ జ్ఞాపకార్థం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన కొర్రకూటి మధు వెంకట సత్తిబాబుకు శనివారం ట్యాబ్ బహూకరించారు. బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ పెన్మత్స రంగరాజు, వాంద్రం మాజీ సర్పంచ్ గోడి గోవింద్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సత్య నారాయణమూర్తి, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కనకరాజు, వాంద్రం మాజీ సర్పంచ్ గొడి గోవింద్ హైస్కూల్‌కి బీరువాలను బహూకరించారు.